క్లుప్తంగా

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఏటూరునాగారం : తెలంగాణ గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపుల్లో ప్రవేశం పొందాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన గిరిజన బాలికలు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 89784 50045 ఫోన్ చేయాలన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీ



బ్రాహ్మణపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ భద్రు

మంగపేట : మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ భద్రు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో వంటగది, పరిసరాలు, విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనిఖీ సమయంలో వార్డెన్లు అందుబాటులో లేరని, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో నిబంధనలు పాటించడం లేదని భోజనం పరిశీలించగా ఏమాత్రం బాగాలేదని అన్నారు విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లో నాలుగు రోజుల అటెండెన్స్ వేయలేదని గుర్తించామన్నారు. ఆయా హాస్టళ్ల పరిశీలనలో వెల్లడైన వాస్తవ పరిస్థితులపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు.

సన్మానం



స్వర్ణకుమారిని సన్మానిస్తున్న సిబ్బంది

ములుగు రూరల్ : ములుగు మెడికల్ కళాశాలకు నూతనంగా వచ్చిన ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారిని బుధవారం కళాశాల సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన మోహన్‌లాల్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో స్వర్ణకుమారి బాధ్యతలు చేపట్టారు.

పశువుల వాహనం పట్టివేత



ఎస్ఎస్‌తాడ్వాయి : అనుమతి లేకుండా పశువులను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి తాడ్వాయిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు వాహనాలను తనిఖీ చేయగా పశువులు కనిపించాయన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీలో కానిస్టేబుళ్లు రజినీకర్, వెంకట్, రమేష్, రవీందర్ ఉన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



చిట్యాల : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై హేమ తెలిపారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాలలో (డ్రగ్స్ నార్కొటిక్) మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాలలో బాగా చదువుకోవాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని అన్నారు. అలాగే ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, పోలీస్ సిబ్బంది లాల్‌సింగ్, చంద్రమౌళి, కళాశాల సిబ్బంది బాలకృష్ణ పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలి

చిట్యాల : మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. గతంలో ఆస్పత్రిలో అనేక ప్రసవాలు అయ్యేవని తెలిపారు. కానీ పది నెలల నుంచి ఎలాంటి ప్రసవాలు లేవని చెప్పారు.

భయం.. భయంగా

బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనాలు

- కుక్కలు, కోతుల స్వైరవిహారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



పస్రాలో స్వైరవిహారం చేస్తున్న వానరాలు



చల్వాయిలో రోడ్డుపై శునకాల గుంపు

గోవిందరావుపేట : మండలవాసులు రోడ్డెక్కాలంటే భయపడుతున్నారు. కుక్కలు, కోతులు దాడి చేస్తాయని భయపడున్నారు. ఒకటి కాదు, రెండు కాదు పదుల సంఖ్యలో సంచరిస్తూ ప్రజలపైకి దూసుకు వస్తున్నాయి. మండల వ్యాప్తంగా వానరాలు, శునకాల బెడద ఎక్కువైంది. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. ప్రతి రోజు మండలంలో ఎక్కడో ఓ చోట కుక్కలు, కోతలు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. చిన్నారులు, మహిళలు, వృద్ధులను గాయపరుస్తున్నాయి. పంటలు, పెంకుటిళ్లను నాశనం చేస్తున్నాయి. ఇళ్లలో, దుకాణాల్లో చొరబడి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. కోతులు, కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో ఉండాల్సిన కోతులు ఇళ్లల్లోకి వచ్చి ఆగం ఆగం చేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కోతులు, కుక్కల బెడద తొలగించి వాటి నుంచి రక్షణ కల్పించాలని మండలవాసులు కోరుతున్నారు.

కిరాణాషాపులు, ఇళ్లలో దాడులు..

వానరాలు తలుపులు, కిటికీల ద్వారా ఇళ్లలోకి చేరి సామగ్రిని చిందర వందర చేస్తున్నాయి. తినే పదార్థాలు ఉంటే తీసుకెళ్లడం, దాడికి పాల్పడుతున్నాయి. దేవాలయాల వద్ద కొబ్బరి చిప్పలు, అరటి పండ్ల వంటి వాటి కోసం ఎగబడి భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పండ్ల దుకాణాలపై కోతుల దాడి మరి భయంకరంగా ఉంటుంది. షాపుల యజమానుల బాధ వర్ణాతీతం. కోతులతో విసిగిపోతున్నట్లు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ఫిర్యాదులు రావడం, వీటికి శాశ్వత చెక్ పెట్టడంలో అధికారులకు సవాల్‌గా మారింది.

రోజుకు పదుల సంఖ్యలో ఆస్పత్రికి..

మండలంలో కోతులు, వీధి కుక్కల సమస్య ఎక్కువవుతుంది. రోజు మండలంలోని గోవిందరావుపేట, పస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకి పదుల సంఖ్యలో కోతులు, కుక్కల బారిన పడి వస్తున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారుగా 500 పైగా వీటి బారిన పడి చికిత్స పొందారు.

అన్ని సీజన్లలోనూ..

కుక్కలు, కోతుల దాడుల్లో రోజు మండలంలో ఎక్కడో ఓ చోట ప్రజలు గాయపడుతూనే ఉన్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 5వేలకు పైగా వీధికుక్కలు ఉంటాయని సమాచారం. ఇక కోతుల సంఖ్య సుమారు లక్షకి పైనే ఉంటుంది.

అధికారులు స్పందించాలి



పస్రాలో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. వందల సంఖ్యలో ఇక్కడి కిరాణా షాపులు, పండ్ల దుకాణాలు, హోటళ్లలో కోతులను తరిమేందుకు ఒక మనిషి ప్రత్యేకంగా ఉండాల్సి వస్తుంది. ఒక్క నిమిషం ఆదా మరిస్తే చాలు వాటి చేతికి దొరికిన తీసుకెళ్తాయి. ఇప్పటికి ఎన్నో సార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలు, కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలి.

– బొమ్మగాని నరేందర్, వ్యాపార సంఘం అధ్యక్షుడు, పస్రా

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



గిరిజన భవన్‌లో మొక్క నాటుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్

ఏటూరునాగారం : ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని కాపాడుకోవాలని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ సూచించారు. మనం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణం, పరిశుభ్రత, మొక్కలు పెంచడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గిరిజన భవన్‌లో సీఐ, ఎస్సైలు మొక్కలు నాటి మాట్లాడారు. కాలుష్యాన్ని నిర్మూలించి స్వచ్ఛమైన గాలికోసం మొక్కలు నాటాలని, భూగర్భ జలాలు పెరగడానికి నీటి నిల్వలకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెత్తాచెదారం లేకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా చూసుకుంటే దోమల బెడద ఉండదని తెలిపారు. కార్యక్రమంలో మనం సొసైటీ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు చౌలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

ములుగు రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చాతల్లా రమేశ్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జేడీ మల్లంపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులకు రూ. 6వేలు, వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ అమలు చేయాలని అన్నారు. లేని పక్షంలో ఆగస్టు 13వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జిల్లా కేంద్రానికి వస్తున్నారని చెప్పారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు సాంబయ్య, రాజయ్య, మమత, సాంబలక్ష్మి, సర్వర్, శ్రీను, కుమారస్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్లను రెగ్యులరైజ్ చేయాలి

ఏటూరునాగారం : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ జిల్లా పరిషత్ పాఠశాలల స్కావెంజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యనమల్ల ప్రవీణ్‌కుమార్ మంత్రి సీతక్కను కోరారు. బుధవారం మండల కేంద్రానికి వచ్చిన సీతక్కకు వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రం చేస్తూ చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలను పెంచాలని, రెగ్యులర్ చేయాలని కోరారు.కార్యక్రమంలో భాగ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

వెంకటాపురం(కె) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాలకు నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు రాలేదని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు సోడి అశోక్, వంశీ తదితరులు ఉన్నారు.

వనదేవతలను దర్శించుకున్న జగదీశ్వర్ గుప్తా



సమ్మక్క అమ్మవారి గద్దె వద్ద పూజలు చేస్తున్న జగదీశ్వర్ గుప్తా

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మను ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. అమ్మవార్లకు ఎత్తు బంగారం, పసుపు, కుంకుమ, చీరసారె, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభుత్వం మోసపూరి అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తుందని తెలిపారు. మళ్లీ ఏపీలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా తల్లులు దీవెనలు ఇవ్వాలని కోరారు.

కులధ్రువీకరణ పత్రాల జారీలో కాలయాపన



సమావేశంలో మాట్లాడుతున్న రవివర్మ

మంగపేట : తహసీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేయడంతో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోదెబోయిన రవివర్మ ఆరోపించారు. మండలంలోని కోమటిపల్లిలో ఆ సంఘం అత్యవసర సమావేశం మండల అధ్యక్షుడు జోగ బాలయోగి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రవివర్మ హాజరై మాట్లాడుతూ..రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ గిరిజనులకు(ఎస్టీ) కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసేందుకు కుల సంఘాల వెరిఫికేషన్ ప్రక్రియ అంటూ కాలయాపన చేస్తు సకాలంలో పత్రాలు జారీ చేయడం లేదని విమర్శించారు. దీంతో అవసరమైన సమయంలో కుల సర్టిఫికెట్లు అందక విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరగాల్సి వస్తోందన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు విచారణ చేయాల్సిన రెవెన్యూ అధికారులు ఆ పనిని బయటి వ్యక్తులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుని విద్యార్థులకు కులధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించే విధంగా చూడాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి పొదెం భార్గవ్, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి ఆగబోయిన చంద్రకాంత్, ఉపాధ్యక్షుడు సాయికుమార్, జబ్బ ప్రణీష్, కుడుముల సాయి తదితరులు పాల్గొన్నారు.

హర్షణీయం

కాటారం : కాటారం కేంద్రంగా విద్యుత్ డివిజన్ ఏర్పాటు హర్షణీయమని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ బుధవారంప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు కృషితోనే కాటారంలో విద్యుత్ డివిజన్ ఏర్పాటు కానుందని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. విద్యుత్ డివిజన్ ఏర్పాటు శుభపరిణామం అని తెలిపారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం



బాలిక తండ్రికి నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు

మంగపేట : ప్రమాదవశాత్తు ఒంటిపై గంజి పడటంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు బీఆర్ఎస్ నాయకులు వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని కొత్తమల్లూరు గ్రామానికి చెందిన మాటూరి కోటేశ్వర్‌రావు జీవనోపాధికి మహబూబాబాద్ పట్టణానికి వెళ్లాడు. ఇటీవల ప్రమాదవశాత్తు ఇంట్లో స్టౌవ్‌పై ఉడుకుతున్న అన్నం గిన్నె తన కూతురు వర్షితపై పడింది. దీంతో వేడి గంజి ఒంటిపై పడటంతో శరీరం కాలి తీవ్రంగా గాయపడింది. వైద్య ఖర్చులకు లక్షల్లో ఖర్చువుతుందని వైద్యులు చెప్పడంతో విషయం తెలుసుకుని తక్షణమే స్పందించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు రూ.10,000, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్ రూ.5,000, బీఆర్ఎస్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, రామకృష్ణ సేవాట్రస్ట్ చైర్మన్ బాడిష నాగరమేశ్ రూ.5,000, జిల్లా నాయకురాలు కొమరం ధనలక్ష్మి రూ.2,000 నగదును అందజేశారు. జమ చేసిన రూ.22,000 నగదును స్థానిక బీఆర్ఎస్ నాయకులు గుండారపు రమేశ్ ఆధ్వర్యంలో బాలిక తండ్రికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులకు బాలిక తండ్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యత లేని ఆహారం తినొద్దు



అవగాహన కల్పిస్తున్న కల్యాణి

భూపాలపల్లి అర్బన్ : వానాకాలంలో చల్లారిన ఆహారం, బయట దొరికే నాణ్యత లేని ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి పద్మ సూచించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు–2లో కార్మికులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ.. నాణ్యతలేని ఆహార పదార్థాలు ఈగలు వాలిన ఆహారం తింటే వాంతులు, విరేచనాలు అవుతాయన్నారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిని సన్మానించిన భూపాల్‌నగర్ గ్రామస్తులు

ములుగు రూరల్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సూచించారు. బుధవారం మల్లంపల్లి మండలంలోని భూపాల్‌నగర్‌లో శివాలయంతో పాటు పాఠశాలను జనగామ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఝాన్సీరెడ్డితో కలిసి సందర్శించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. తన అత్త, మామ హనుమాండ్ల లక్ష్మమ్మ–పాపిరెడ్డి పేరిట నిర్మించిన పాఠశాల భవనం, శివాలయం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సిరెడ్డిలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుల సాంబయ్య, మాజీ ఎంపీటీసీ నాగిడి రమణారెడ్డి, అనంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లోక్‌నాథం, లక్ష్మణ్, భాస్కర్, సాంబయ్య, సుదర్శన్, భీమా తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' పేరిట ఇసుక దందా

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రవిగౌడ్

టేకుమట్ల : చలివాగు, మానేరు నుంచి లారీల్లో, ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ పేర్కొన్నారు. అక్రమంగా దందాలు, ధర్నాలు ఎవరు చేస్తున్నారో మండలవాసులు గమనిస్తున్నారని అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల అనుమతుల పేరుతో ఇతర ప్రాంతాలకు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించారో.. ఇప్పటి వరకు ఎన్ని అక్రమ దందాలు కొనసాగిస్తూ ఇసుకను తరలించారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. స్థాయిని మరిచి మాట్లాడితే సరైంది కాదని తెలిపారు.చిన్న గ్రామంగా ఉన్న భూపాలపల్లి నేడు జిల్లా కేంద్రంగా అభివృద్ధిలోకి తీసుకొచ్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీది అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బండెల నరేష్, నల్లబెల్లి రవీందర్, మారం లింగారెడ్డి, రేణుకుంట్ల సమ్మయ్య, వసంతరావు, వరదచారి, లక్ష్మణ్, నర్సింగరావు, మొండయ్య, కుమారస్వామి, రాజ్‌కుమార్, రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మంగపేట: మల్లూరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంత్



వాజేడు: రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ మహేందర్



ట్రాక్టర్ టైర్‌లో ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

వాజేడు : దోమలను అరికడితేనే ఆరోగ్యంగా ఉంటామని వాజేడు, పేరూరు వైద్యులు మహేందర్, రాహిల్ అన్నారు. మండల పరిధిలోని ఘణపురం, మొట్లగూడెం, చిన్న గొళ్లగూడెం గ్రామాల్లో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి మందులు ఇవ్వడంతో పాటు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. టైర్లు, ఇతర సామగ్రిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రతలు పాటించాలి

మంగపేట : మండలంలోని మల్లూరు, పూరేడుపల్లి గ్రామాల్లో ఎంసీహెచ్ మొబైల్ టీం వైద్యాధికారి ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో 76 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 12 మంది జ్వరపీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరు ఆరోగ్య జాగ్రతలు తప్పక పాటించాలని వైద్యాధికారి ప్రజలకు సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా జనావాసాల పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా చూసుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, స్టాఫ్‌నర్స్ అమరావతి, ఏఎన్ఎం సారమ్మ, సీతమ్మ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

- ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

ములుగు రూరల్ : ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఏడుగురికి గాయాలైన సంఘటన మండలంలోని జంగాపల్లి పంచాయతీ పరిధి రాంనగర్ తండాలో బుధవారం చోటుచేసుకుంది. గోవిందరావుపేట మండలం మత్తాపురం గ్రామానికి చెందిన కల్లి బాయక్క, బుచ్చమ్మ, సత్తమ్మ, ఎల్లమ్మలు ములుగు మండలం కన్నాయిగూడెం గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి వెళ్తున్న క్రమంలో కొత్తూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ములుగు వస్తున్నాడు.ఈ క్రమంలో ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న వారితో పాటు డ్రైవర్, ద్విచక్ర వాహనదారుడి గాయాలయ్యాయి. గమనించిన వారు 108 వాహనానికి సమాచారం అందించి క్షతగాత్రులను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.